కొనుగోలు కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోతే చర్యలు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూరలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర, ఏప్రిల్ 29 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం, చెల్లింపులు, సౌకర్యాలు, లారీలు తదితర వివరాలను పీఏసీఎస్ సీఈఓ వెంకట్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో రికార్డులు సరిగా నిర్వహించకపోవడం, ధాన్యం కొనుగోలుపై అవగాహన లేకపోవడం, విధుల పట్ల అలసత్వం కారణంగా సీఈఓ వెంకట్‌రెడ్డిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా లింగంపల్లిలో రైతు ఉత్పత్తుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీశ్, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, తాసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మిర్యాలగూడ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 29 : మిర్యాలగూడ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లుతో కలిసి పబ్లిక్ హెల్త్ అధికారులు, డిజైనింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు మున్సిపల్ శాఖ సంయుక్తంగా చేపట్టిన అమృత్ 2.0 పథకం కింద త్రిపురారం మండలం కంపసాగర్ చెరువు, పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి మిర్యాలగూడ మండలం వాటర్ ట్యాంక్ వద్ద వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పైపులైన్ల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరో 20 ఎంఎల్‌డీ (20లక్షల లీటర్ల) నీటిని తీసుకొచ్చేందుకు అమృత్ పథకం కింద నిధులను ఖర్చు చేస్తూ పనులను పబ్లిక్ హెల్త్ అధికారుల ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లోని వ్యర్థాలను చెత్త ఆటోలో వేయకుండా ముందస్తుగా వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. సమావేశంలో నల్లగొండ పబ్లిక్ హెల్త్ డీఈ మనోరమ, మున్సిపల్ డీఈఈ వెంకన్న, కేఎన్ఆర్సీ ప్రాజెక్టు మేనేజర్ చెన్నూరి బాపూజీ, ప్రాజెక్టు డిజైనర్లు సురేశ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డిప్యూటీ కంట్రోలర్ రోహిత్, పబ్లిక్ హెల్త్ ఏఈ సాయితేజ, పబ్లిక్ హెల్త్ డిజైనర్లు కల్యాణ్, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

దిగుమతిలో స్థానిక ధాన్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

తాసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల, ఏప్రిల్ 29 : రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుమతిలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలకు కాకుండా స్థానికంగా కొనుగోలు చేసిన ధాన్యం లారీల దిగుమతికి ప్రాధాన్యం ఇవ్వాలనీ సీపీఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. లారీలకు అదనంగా రైతులపై వేసే వెయిటింగ్ చార్జీలను వసూలు చేయవద్దని, కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు జరిగిన వెంటనే మిల్లుల వద్ద దిగుమతి జరిగేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, ఐతరాజు నర్సింహ, అరూరి శ్రీను, బొబ్బిలి సుధాకర్ రెడ్డి, శీలా రాజయ్య, రూపని ఇద్దయ్య, బొడ్డు బాబురావు, వడ్డగాని మహేశ్, గుండాల యాదయ్య, పల్లపు పెంటయ్య తదితరులు ఉన్నారు.

చినుకుంట చెరువులో చేపలు మృతి

● విషం కలుపడంతో చనిపోయాయని మత్స్యకారుల ఆరోపణ

చెరువులో చనిపోయిన చేపలు

హాలియా, ఏప్రిల్ 29 : అనుముల మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చినుకుంట చెరువులో మంగళవారం చేపలు మృత్యువాతపడ్డాయి. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో విషం కలుపడం వల్లే చెరువులు చనిపోయాయని మత్స్యకార్మిక సంఘం చైర్మన్ నాశన బోయిన వెంకటయ్య, ఉప సర్పంచ్ మేక లింగయ్య తెలిపారు. సుమారు 5 క్వింటాళ్ల చేపలు చనిపోయినట్లు చెప్పారు. గతేడాది ఈ చినుకుంట చెరువును మత్స్యకార్మిక సంఘం లీజుకు తీసుకొని చేపల పెంపకం చేపట్టింది. చెరువులో విషం కలిపిన వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని, తమకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని మత్స్య కార్మిక సంఘం నాయకులు కోరారు.

అగ్ని ప్రమాదంలో అయిల్ పామ్ తోట దగ్ధం



కాలిపోయిన అయిల్‌పామ్ తోట

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 29 : అగ్ని ప్రమాదంతో ఎకరంన్నర ఆయిల్ పామ్ తోట దగ్ధమైన సంఘటన పీఏపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పీఏపల్లికి చెందిన పల్లా సందీప్ రెడ్డి ఎనిమిది ఎకరాల్లో ఆయిల్ పామ్ తోట సాగు చేస్తున్నాడు. తోటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చేలరేగి తోటలోకి మంటలు వ్యాపించాయి. దీంతో 80 ఆయిల్ పామ్ చెట్లతోపాటు డ్రిప్‌లు కాలి బూడిదయ్యాయి. పంట చేతికి వచ్చే సమయంలో అగ్నికి అహుతి కావడంతో తీవ్రంగా నష్ట పోయిన్నట్లు రైతు వాపోయాడు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ శ్రీనువాసుఉ పరిశీలించారు.

నిరుపేద వైద్యం కోసం ఆర్థిక సాయం

సాయితేజ్ తండ్రి కృష్ణకు నగదు అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు

మోత్కూరు, ఏప్రిల్ 29 : మండలంలోని పనకబండ గ్రామానికి చెందిన పొన్నెబోయిన సాయితేజ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో 'మన మోత్కూరు వాట్సాప్ గ్రూప్' ద్వారా విరాళాలు సేకరించారు. దాతల నుంచి సేకరించిన రూ.19వేల నగదును మంగళవారం సాయితేజ్ తండ్రి కృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు దబ్బెటి సోంబాబు, గనగాని నర్సయ్య, అవిశెట్టి అవిలి మల్లు, ఎండీ సమీర్, కారుపోతుల వెంకన్న, గాదె వెంకటేశ్వర్లు, ఎం.శ్రీను పాల్గొన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి (నూతన రైతు చట్టం) 2025పై పట్టణంలోని గంజ్ మార్కెట్ ఆవరణలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ అంజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే సదస్సుకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కేసీఆర్ పాలనే బాగుండె..

● కొండమల్లేపల్లిలో మిర్చి గిర్ని వద్ద మహిళల ముచ్చట్లు

కొండమల్లేపల్లి పట్టణంలోని మిర్చి గిర్ని వద్ద మాట్లాడుకుంటున్న మహిళలు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 29 : ముగ్గురు, నలుగురు ఒక్కచోట చేరారంటే ఏదో ఒక విషయం మాట్లాడుకోడం సహజం. మండల కేంద్రంలో సోమవారం మిర్చి గిర్ని వద్ద ముగ్గురు మహిళల మధ్య ఆసక్తికరమైన చర్చ నడిచింది. కొండమల్లేపల్లిలో వారం వారం అంగడి జరుగుతుంది. కాగా ప్రస్తుతం గిరాకీ లేదని, కేసీఆర్ పాలనలో గిరాకీ బాగా ఉండేదని, వ్యాపారం జోరుగా సాగేదని అంగడికి వచ్చిన ముగ్గురు మహిళలు మాట్లాకోవడం కనిపించింది. కేసీఆర్ సారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు పెట్టుబడి సాయం అంది, పంటలు బాగా పండి రైతులు, రైతు కూలీలు ఆర్థికంగా మెరుగ్గా ఉండడంతో జనం దగ్గర కూడా డబ్బులు ఉండేవని..దీంతో అన్ని వ్యాపారాలు బాగా నడిచేవని చెప్పుకొచ్చారు. దీంతో ఇంటిల్లిపాది సంతోషంగా ఉండేదని మాట్లాడుకున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పింఛన్, పెంచలేదని, రైతుబంధు ఇస్తలేడని, రైతు రుణ మాఫీ కూడా సక్కంగా చేయలేదని, అంతా గందరగోళంగా ఉందని, ఏ ఒక్కటీ బాగాలేదని విచారం వ్యక్తం చేశారు.

సభకు వచ్చిన జనాన్ని చూసి కాంగ్రెస్‌కు మతిభ్రమించింది

● బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దస్రూనాయక్

మాట్లాడుతున్న రమావత్ దస్రూనాయక్ తదితరులు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 29 : వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా జనం తరలిరావడంతో కాంగ్రెస్ పార్టీ నేతలకు మతిభ్రమించిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన ఆపార్టీ సీనియర్ నాయకుడు కేసాని లింగారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందని, ఈ అంశాన్ని రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రస్తావిస్తే కాంగ్రెస్ నేతలకు మింగుడు పడడంలేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతలకు పరిపాలించే సత్తాలేదని, అలాంటి వారు కేసీఆర్ అసెంబ్లీకి రావడంలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టి మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రిగా చేసి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రావుల వెంకటయ్య, నాయకులు రమావత్ దీప్లానాయక్, అందుగుల వెంకటేశ్, వరికుప్పల పాండు, దాచేపల్లి నరేందర్, పెద్దిశేట్టి సత్యం, తొటపల్లి శ్రీను, ముశిని శేఖర్ యాదవ్, రావుల సత్యనారాయణ, తోటపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తమ భూమిని ఇప్పించాలని పెట్రోల్ బాటిళ్ల తో నిరసన

నార్కట్‌పల్లి తాసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిళ్లతో నిరసన తెలుపుతున్న బాధిత రైతు, వారి కుటుంబం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 29 : ప్రభుత్వం తమకు ఇచ్చిన భూమిని తమకు ఇప్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించినా స్థానిక తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఇబ్బదులు పెడుతున్నారని బాధిత రైతులు మంగళవారం నార్కట్‌పల్లి తాసీల్దార్ కార్యాలయం ఎదుట అందోళన చేపట్టారు. పెట్రోల్ బాటిల్స్‌లో నిరసన చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు వచ్చి సమస్య పరిష్కరిస్తామంటూ నచ్చజెప్పడంతో వారు వెళ్లి పోయారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపలాయ పల్లి శివారు సర్వే నంబర్ 550లో ప్రభుత్వం 30 గుంటల భూమిని రాముడి గోపాల్ రెడ్డికి ఇచ్చింది. ఆ భూమిని యాంపిల్ లైఫ్ సైన్సెస్ కంపెనీ, శీనా బయోటెక్ విత్తనాల సంస్థలు కబ్జా చేసిందని, ఇటీవల కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 17న అధికారులు సర్వే నిర్వహించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఆ భూమిని కబ్జా చేశారని తేలిపోవడంతో 48 గంటల్లో ఆ సంస్థను కార్యాలయాన్ని కూల్చాలని కలెక్టర్ ఆదేశించారు. కానీ తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, సంబంధిత సిబ్బంది తమకు అన్యాయం చేస్తూ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని బాధితుడు గోపాల్ రెడ్డి, ఆయన కుంటుంబం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ న్యాయం చేయాలని తాసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిళ్లతో నిరసన తెలియజేశారు. ఎస్ఐ క్రాంతికుమార్ నచ్చజెప్పడంతో వారు వెళ్లి పోయారు.

బాల్య వివాహాలను అరికట్టాలి : శారదారాణి

బాల్యవివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కట్టంగూర్, ఏప్రిల్ 29 : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బూరుగు శారదారాణి అన్నారు. కట్టంగూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల ఆడపిల్లలు అనారోగ్యం పాలవుతారని తెలిపారు. అనంతరం బాల్య వివాహ విముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేసి పోస్టర్‌ను ఆవిష్కరించారు, కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, పూజారి యుగేంధర్ శర్మ, కోఆర్డినేటర్ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రమేశ్

చిట్యాల, ఏప్రిల్ 29 : యువత ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ అన్నారు. మండలంలోని వెల్మినేడులో మంగళవారం ఆయన మల్లం యాదయ్య 29వ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్, మండల ఉపాధ్యక్షుడు కూనూరు గణేశ్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి వడ్డగాని మహేశ్, నాయకులు దేశబోయిన నర్సింహ, అరూరి నర్సింహ, ఆడెపు రమేశ్, గోలి సాయికిరణ్, అరూరి పవన్, మేడి మనోజ్, నాతి వెంకటరమయ్య, సురకంటి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

చిట్యాలలో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

చిట్యాల, ఏప్రిల్ 29 : హైదరాబాద్‌లో బీసీ సంఘాలు సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో అక్కడికి వెళ్లకుండా మంగళవారం చిట్యాల మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. చిట్యాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్ఎస్ 2, 9వ వార్డు ఇన్‌చార్జిలు, కోనేటి ఎల్లయ్య, ఆగు అశోక్, నాయకులు పోలపల్లి సత్యనారాయణ, ఆవుల అంజి, ఆవుల ఆనంద్, ఎండీ గౌస్, పుల్లాసు కన్యాచారి తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

విద్యారంగ సమస్యలపై..

మిర్యాలగూడ, ఏప్రిల్ 29: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపుమేరకు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్లగొండ కలెక్టర్ కార్యాలయ ముట్టడికి వెళ్తున్న బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్‌ను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడిసిన్, డిగ్రీ, పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.4వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

సజావుగా టీఎస్ ఎప్‌సెట్ ప్రారంభం

రామగిరి, ఏప్రిల్ 29 : తెలంగాణలో ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్-2025 పరీక్షలు మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌పీఆర్ పాఠశాల ఆవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో ప్రారంభమయ్యాయి. నల్లగొండలో ఉదయం 185మంది విద్యార్థులకు 179మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 185 మందికి 177మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ మూల్యాంకనం ప్రక్రియ

రామగిరి, ఏప్రిల్ 29 : ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్మీడియట్ చదివే అభ్యర్థుల వార్షిక పరీక్షలు ఈ నెల 20 నుంచి 25 వరకు జరిగిన విషయం విదితమే. రాష్ట్రంలోని పలు పరీక్ష కేంద్రాల నుంచి జవాబు పత్రాలు నల్లగొండకు చేరాయి. వీటిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో భద్రపర్చగా, అందులోనే మూల్యాంకనం కేంద్రాన్ని డీఈఓ బి.భిక్షపతి, జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. జవాబు పత్రాల కోడింగ్ ప్రక్రియ ఈ నెల 30నుంచి ప్రారంభమవుతుంది. కోడింగ్ పూర్తయిన తర్వాత మే 5 నుంచి 7వరకు తొలి విడతలో 10వతరగతి.. మే 8 నుంచి 10వరకు ఇంటర్మీడియట్ మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకనానికి అవసరమైన సీనియర్ ఉపాధ్యాయులు మే 1న ఉదయం 8 గంటలలోగా స్పాట్ కేంద్రంలో హాజరుకావాలని సూచించారు.

నేడు నల్లగొండలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 29 : పట్టణంలో రోడ్ల విస్తరణ, ట్రాన్స్‌ఫార్మర్ల చార్జింగ్ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వేణుగోపాలచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్ల షిఫ్టింగ్ కారణంగా బుధవారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, సతీశ్‌నగర్, డాక్టర్స్ కాలనీ, అన్నారీ కాలనీ, బస్టాండ్ ఏరియా, దారుషాప కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీనగర్‌కాలనీ, లక్ష్మీనరసింహ కాలనీ, సాయిశ్రీకాలనీలో కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

మిర్యాలగూడ పట్టణంలో..

మిర్యాలగూడ : పట్టణంలోని సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ బంగారుగడ్డ ఫీడర్ లైన్ వర్క్ జరుగుతున్నందున బుధవారం బంగారుగడ్డ, సీతారాంపురం, రాజీవ్‌చౌక్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మిర్యాలగూడ వన్‌టౌన్ విద్యుత్ ఏఈ పి.మహేశ్ మంగళవారం తెలిపారు.

మేడేను జయప్రదం చేయాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 29 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం మండల కార్యదర్శి చెలకాని మల్లయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్క బుచ్చిరాములు, ఎర్ర రమేశ్, వెంకన్న, అవనిజ, డెంకెల లింగయ్య ఉన్నారు.

త్రిపురారం : మే 1న మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దైద శ్రీను, సీఐటీయూ మండల కన్వీనర్ నల్లగొండ నర్సిరెడ్డి కోరారు. చింతపల్లి శంకర్, వెంకటేష్, హరిబాబు పాల్గొన్నారు.

రామగిరి : మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ. సలీం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సత్తయ్య, అద్దంకి నర్సింహ, అవుట రవీందర్, పెరిక కృష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 29 : దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద జగిని టెక్స్‌టైల్స్, జగిని డెంటల్ కేర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని మంగళవారం డీఎస్పీ శివరాంరెడ్డి, ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జయరామయ్య, జగిని సేవా సంస్థ జగిని వెంకన్న, సీఐ ఆదిరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ గోపాల్ రెడ్డి, ఆలయ అర్చకులు శ్రవణ్, ఉపేందర్ రెడ్డి, శ్రీకర్ తదితరులు ఉన్నారు.

బొడ్రాయి పండుగకు రావాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఆహ్వానం

చందంపేట, ఏప్రిల్ 29 : చందంపేట మండలంలోని ముడుదండ్ల గ్రామంలో మే 5న నిర్వహించే బొడ్రాయి పండుగకు హాజరు కావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి చందంపేట బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు యాసాని రాజవర్ధన్‌రెడ్డి ఆహ్వానించారు.

భూ భారతి చట్టంతో సమస్యలు పరిష్కారం

● భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారంలో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

శాలిగౌరారం, ఏప్రిల్ 29 : ప్రభుత్వం తీసుకున్న భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించుకునేందు ప్రభుత్వం సర్వ హక్కులు అధికారులకు కల్పించిందన్నారు. 80శాతం తాసీల్దార్‌ల వద్దనే పరిష్కారమవుతాయని తెలిపారు. ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతులు ఎంతో ఉపయోగపడుతుందని, భూములకు సంభందించిన రికార్డులను ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న గ్రామ పంచాయతీ పరిధిలో ప్రదర్శిస్తారని చెప్పారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి మాన్యానాయక్, తాసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి, వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, నాయకులు కందాల సమరంరెడ్డి, అన్నెబోయిన సుధాకర్ పాల్గొన్నారు.

భూ సమస్య చెప్పకుండామని పోతే గల్లా పట్టిండ్రు..

శాలిగౌరారంలో జరిగిన రైతు భూ భారతి సదస్సులో తమ భూమికి సంబంధించిన విషయం కలెక్టర్‌కు చెప్పేందుకు వెళ్తుండగా శాలిగౌరారం ఎస్ఐ గల్ల పట్టి అడ్డుకున్నారని మండలంలోని ఎన్జీకొత్తపెల్లి గ్రామ రైతు సంకటి పోతరాజు, అతని అల్లుడు శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. భూ భారతిలో భూమి సమస్యలను చెప్పేందుకు వీలు లేకుండా అడ్డుకోవడంపై సర్వతా విమర్శలు వినిపిస్తున్నాయి.

పైవేట్ దవాఖానలు ప్రభుత్వ నిబంధనలను పాటించాలి

● డీఎంహెచ్ఓ శ్రీనివాస్

ప్రైవేట్ ఆసుపత్రిలోని వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

మిర్యాలగూడ, ఏప్రిల్ 29: ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ దవాఖానలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి రిజిస్ట్రేషన్, రేడియాలజిస్ట్, పాథాలజిస్ట్, ఆసుపత్రి రెన్యూవల్, ఫైర్ సేఫ్టీ, ధరల వివరాలను పరిశీలించారు. డాక్టర్ల క్వాలిఫికేషన్, వారి సర్టిఫికెట్లను పరిశీలించారు